# 16

# ఒదిగి ఉన్న మంచితనం

ప్రతిపక్ష పార్టీవారి నినాదాల జోరులా ఎడతెరిపి లేకుండా కురుస్తోంది వాన. ఊరేగింపులా ప్రవహిస్తోంది వాన నీరు. అతివృష్టీ... అనావృష్టీ... వానలు వానలు... వరదలు వరదలు... పంటలన్నీ మునిగిపోయాయి మునిగిపోయాయి... పాడితే ఈ పాటా... లేకపోతే.. వానల్లేవు వానల్లేవు... పంటల్లేవు... ఈ పాటా... పాడుకోవల్సిందే రైతన్నలు.

అంత వర్షంలోనూ వస్తున్న వీరయ్య కనిపించాడు కిటికీలోంచి... ఆశ్చర్యం చిందులేసింది కాశీపతిలో. మళ్ళీ అంతలోనే వీరయ్యకి తనంటే ఉన్న భయం భక్తీ తల్చుకుని గర్వంతో కుడిచెయ్యి మీసంమీదికెళ్ళింది. వీధిగుమ్మం తలుపు తీశాడు.

"దండాలయ్యా..." గుమ్మంలోకొచ్చాడు వీరయ్య. మెట్లమీదే నిలబడి చేతిలో ఉన్న చిన్న రెక్సిన్ సంచీలోంచి... అతిభద్రంగా ప్లాస్టిక్ కవర్లలో చుట్టి ఏమాత్రం చెమ్మ తగలకుండా చిన్న డబ్బాలో పెట్టి తీసుకొచ్చిన డబ్బు అందించాడు వీరయ్య.

"వరండాలో కూచుంటావా?" మొక్కుబడిగా అడగడం తెలుస్తోంది ఆ గొంతులో. ఆ మాత్రం అర్థం చేసుకోలేడా వీరయ్య! అందుకే మెల్లిగా తల అడ్డంగా ఊపాడు.

సంచీలో ఉన్న తువాలు తీసి మొహం ఓసారి తుడుచుకుని తలకి ఉన్న ప్లాస్టిక్ టోపీ సవరించుకుని చేతులు జోడించి సెలవు తీసుకున్నాడు. తలుపు గడియవేసి లోపలికొస్తున్న భర్తని అడిగింది ధనలక్ష్మి "ఎవరండీ... ఇంత వానలో వచ్చారు?"

"వీరయ్య. డబ్బిచ్చి వెళ్ళాడు".

"మరదేవిటీ? అలాగే పంపించేశారు? పొరుగూర్నించి వచ్చినవాడు మంచినీళ్ళన్నా..." భార్య మాట పూర్తికాకుండానే గయ్యిమన్నాడు "వర్షంలో దాహేలా?"

"ఒకటో తేదీ కదా ఇవ్వాలి... అప్పుడే వచ్చాడే పాపం... అందులో ఇంత వానలో?"

"పాపం లేదు గీపం లేదు. నెల నెలా వచ్చి ఇస్తున్నది వడ్డీ డబ్బులు. ఇప్పుడొచ్చి ఇచ్చింది అసలు మొత్తం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవాళొచ్చి అసలు చెల్లించాలని కబురు చేశాన్లే మా వాళ్ళింట్లో డబ్బు సద్దుబాటు చేద్దామని".

"మీ వాళ్ళింట్లో సద్దుబాటు చెయ్యడానికి మీ దగ్గర లేదు గనకనా? పాపం... వీరయ్య చాలా మంచివాడు... ప్రతి నెలా ఒకటో తేదీకల్లా వడ్డీ డబ్బులు తెచ్చి కట్టేస్తాడు".

"ఎవ్వర్నీ నమ్మకూడదులే. పోన్లే పాపం అనుకున్నామంటే ముందు ముందు ఏవో సాకులు చెప్తూ ఉంటారు. ఎప్పుడూ ఏదో ఓ ఏడుపు ఏడుస్తుంటారు... పంటలు పండలేదనో... పంటలు మునిగిపోయాయనో... అందుకే అప్పు ఇచ్చేటప్పుడే నేను చెప్పేస్తుంటాను. ప్రకృతితో నాకు సంబంధం లేదని... నా నిబంధనల ప్రకారం తీసుకున్న అప్పు తిరిగిచ్చేస్తూ ఉండాలని".

"మీరు చెప్పినట్టే నడుచుకునే ఖచ్చితమైన మనిషి కదండీ వీరయ్య. ఒకటో తేదీ పట్టుకొచ్చి ఇచ్చేవాడే కదా... ఈ లోపలెందుకు పాపం..."

"తీసుకొచ్చి ఇచ్చాడంటే వాడి దగ్గర డబ్బుందన్న మాటేగా... మనం జాలిపడాల్సిన అవసరం లేదని దీన్నిబట్టి నీకు తెలుస్తోందా లేదా?" సొమ్ముదాచి పెట్టడానికి లోపలిగదిలోకి వెళ్ళాడు కాశీపతి.

ఎన్ని తంటాలుపడి... ఎంతలోతు కష్టాల్లో మునిగి సమకూర్చి తెచ్చాడో ఆ సొమ్ము. ఇలా అర్థంతరంగా!... లోలోపల అనుకోకుండా ఉండలేకపోయింది ధనలక్ష్మి.

✧ ✧ ✧

"ఏం చేద్దావనుకుంటున్నావు?" జాలిగా భర్తవంక చూస్తూ అడిగింది వీరయ్య భార్య సత్తెమ్మ.

"పిల్ల పెళ్ళి ఇప్పట్లో చెయ్యలేనని చెప్పేస్తాలే వాళ్ళకి".

"వాళ్ళంతట వాళ్ళుగా మనపిల్లని చేసుకుంటామని అడిగినా..." మాట పూర్తి చెయ్యలేకపోయింది గుండెల్లో పట్టేసినట్టయింది.

"డబ్బు లేనప్పుడేం చేయాలి?"

"కూతురిపెళ్ళి అయినాక నెమ్మదిగా అప్పుతీర్చుకుందుకు గడువు అడక్కపోయావా అయ్యగార్ని?"

చెంపలేసుకున్నాడు వీరయ్య. "అమ్మో.. నీకు జబ్బుచేసినప్పుడు... వైద్యానికి డబ్బులేక... రెండు మాసాల వడ్డీ ఆలస్యంగా తీర్చుకుంటానయ్యా అని బతిమాలితే ఎన్నెన్ని మాటలన్నాడు!... ఎప్పుడూ ఎవరిచేతా మాటనిపించుకోలేదు నేను... నీకూ తెలుసు..."

ఇంకే మనగలదు? నిజమే కదా అతనన్నది కూడా...

కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ లోపలికి నడిచింది పెరట్లోంచి.

బొగడ చెట్టుకింద కూచునుంది చిట్టి... వీరయ్య కూతురు. ఇంటి పరిస్థితి అర్థం చేసుకోలేని పసిపిల్ల కాదు. రాలుతున్న బొగడపూలు తనని ఓదారుస్తున్నట్టుగా తోచి నవ్వు కుంది నిర్లిప్తంగా.

✧ ✧ ✧

తన కూతురి పెళ్ళి చెయ్యలేక... అప్పులు తీర్చలేక పురుగులమందు తాగి పైడిరాజు ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్త తెల్లారేసరికి గుప్పుమంది. రెండిళ్ళవతల ఉన్న పైడిరాజు ఇంటికి పరిగెత్తాడు వీరయ్య.

గుండె పగిలిపోయేలా ఏడుస్తోంది అతని భార్య.

ఓదార్చబోయిన వీరయ్య గొంతు గాద్గదికమై కూలబడిపోయాడు.

"పీకలోతు అప్పుల్లో కూరుకుపోయాడు. ఇటు చూస్తే అనాకారి కూతురు. దాని పెళ్ళి చెయ్యలేక బెంగ... చేతిలో పైసలుంటే తన కూతురి అనాకారితనం ఎవ్వరికీ కనపడేది కాదంటూ ఉండేవాడు. బతుకంతా ఊడిగం చేసినా అప్పులు తీరవని ఇంతపని చేశాడు..." పక్కింటి శంకరం జాలి చూపులు. కాస్త దూరంగా

ఇవతలకి వొచ్చాక శంకరంతో అన్నాడు వీరయ్య "ఆత్మహత్య చేసుకుంటే సమస్య తీరిపోతుందా? సమస్య ఇంకా పెరిగిపోతుంది. ఆ అమ్మా బిడ్డలకి దిక్కులేకుండా అయిపోలా? ఆ కూతురికి ఓ దారి చూపించలేనేమో అని... రేపు... ఆ తల్లి ఏదన్నా ఇలాంటి పనే చేస్తే?"

"నీ అంత గుండెధైర్యం అందరికీ ఉండదులే వీరయ్య మావా".

"గుండెధైర్యంతోపాటూ... చచ్చి సాధించేమీ లేదన్న ఆలోచనా ఉండాలి'. పై కండువాతో కళ్ళు తుడుచుకుంటూ జవాబిచ్చాడు వీరయ్య.

✧ ✧ ✧

ఓ రోజు పైడిరాజుని గురించిన ఆలోచనల్తోనే నిద్రపట్టక అర్ధరాత్రి లేచి ఇంట్లోంచి బయటికొచ్చాడు వీరయ్య చల్లగాలికి. ఎడంచేతివైపు వేపచెట్టుకి అవతలున్న నూతిదగ్గర ఇద్దరు ఎవరో తారట్లాడటం చూసి ఉలిక్కిపడ్డాడు. చప్పుడు చెయ్యకుండా చెట్ల చాటుగా చేరాడు అక్కడికి. అప్పటికే ఆ ఇద్దరూ నూతి గట్టెక్కారు. ఒక్క ఉదుటున ఇద్దరి చేతులూ పుచ్చుకుని కిందకి లాగాడు. భోరుమంది పైడి రాజు భార్య... రెండు చేతుల్తో మొహం కప్పుకుంది కూతురు.

"మతులు పోయాయామీకు?" గదమాయించాడు.

"మమ్మల్ని చావనీ అన్నా" ఇంకోమాట రావట్లేదు ఆమెనోటినుంచి.

"నీ బిడ్డకి ధైర్యం చెప్పాల్సిన దానివి... ఇదేవన్నా బావుందా?"

"కొందరనే మాటలు వింటుంటే... చావేనయం అనిపిస్తోంది అన్నా..."

"ఊరుకోమ్మా!... అలా ఎప్పుడూ అనుకోవద్దు. మా ఇంట్లో అందరికీ మీ కుటుంబం అంటే అభిమానం ఉంది... అందుకే రాత్రి పడుకునే ముందు మా అబ్బాయితో మాటాడాను. వాడిదీ నాదీ ఒకటే మాట. మీ అమ్మాయికి మా ఇంటి కోడలిగా రావడం ఇష్టమేనా... అని రేపు అడుగుదామనుకున్నాను".

నిజమా అన్నట్టుగా నోరెళ్ళబెట్టి చూసింది పైడిరాజు భార్య.

ఏడుపు ఆపి టక్కున మొహమ్మీంచి చేతులు తీసిన కూతుర్ని దగ్గరికి తీసుకుంది.

"తిరపతయ్య కొడుక్కి నా కూతుర్ని చేసుకుంటామని వాళ్ళే అడిగారు. కానీ... మా దురదృష్టం... అప్పు ఉన్నపాటుగా తీర్చమనడంతో చేతిలో సరిపడా సొమ్ము లేకపోబట్టి ఆ మాటే తిరపతయ్యతో చెప్పాను... వాళ్ళడిగిన కట్న కానుకలు లాంఛనాలు ఇచ్చి ఇప్పట్లో పెళ్ళి చెయ్యలేననీ... ఓ ఏడాదైనా పడుతుందనీ చెప్పాను. అప్పటిదాకా ఆగేది లేదంటూ వేరే సంబంధం చూసుకున్నారు వాళ్ళు. మీకూ తెలిసే ఉంటుందీ సంగతి". "అందుకే చెప్తున్నాను... నీ కూతురి పెళ్ళికి అప్పు చెయ్యాలని అనుకోకు. నువ్వొక్క పైసా ఖర్చుపెట్టద్దు. గుళ్ళో చేసేద్దాం. పిల్ల కోడలిగా మా ఇంట్లో అడుగు పెట్టడం మనక్కావల్సింది. కలో గంజో మాతోపాటే... మీకు సమ్మతమైతేనే..."

"మా పాలిటి దేవుడివన్నా నువ్వు..." చేతులు జోడించింది ఆమె.

✧ ✧ ✧

"దండాలయ్యా" గుమ్మంలోకివచ్చిన వీరయ్య వైపు నిర్లక్ష్యంగా చూశాడు కాశీపతి.

"ఊ... మళ్ళీ వొచ్చావూ... అప్పుకోసం?"

"డబ్బు కోసం రాలేదయ్యా..."

"మరి?..." ఎనిమిదో వింతలా అనిపించింది కాశీపతికి.

"నా కొడుకు పెళ్ళి రేపు మా ఊరి గుళ్ళో పెట్టుకున్నామయ్యా... మెళ్ళో పసుపు కొమ్ము కట్టించి కోడల్ని మా ఇంటికి తెచ్చుకోడమే... చుట్టాలూ పిలుపులూ ఏవీ లేవు... కానీ... కానీ..."

కబుర్లు చెప్తాడు... కాసులకోసం కాకపోతే తన దగ్గర కెందుకొచ్చినట్టో?...

"పెళ్ళికూతురికి చిరిగిపోయిన చీరలు తప్ప మంచివి లేవయ్యా. అందుకని పిల్లకోసం ఓ చీర... పిల్లాడికో చొక్కా కొనుక్కు పోదావని నేనూ నా కొడుకూ బట్టల కొట్టుకని బయల్దేరి వొచ్చాం. బస్సు దిగి అడ్డదోవన పడి నడుచుకుంటూ వొస్తుంటే... తుప్పల చాటు ఓ కుర్రాడు పడిపోయి ఉన్నాడండీ... కాలేజీ కుర్రాడి వయసుంటుంది. జేబులో ఉన్న డబ్బు చేతివాచీ ఇలాంటివి లాక్కుపోయేందుకు కొట్టి పడేసుంటారండీ ఎవరో... మన తెలివిలో లేడండీ... పూర్తిగా తెలివి తప్పిపోయింది. మా అబ్బాయి భుజాన్నేసుకుంటే పరుగు పరుగున ఆ పక్కనున్న ఆస్పత్రికి తీసుకుపోయాం. ఎన్నెన్నో

ప్రశ్నలేసి జేరిపించుకున్నారు వాళ్ళు. అరిజంటుగా ఇంజీషన్లకి మందులకి డబ్బడిగితే మా దగ్గిరున్నది ఇచ్చేశాం. ఆ మనిషి బతికి బయటపడితే అంతే చాలనుకున్నాం. ఆ కుర్రాడికి తెలివొచ్చేదాకా మేము ఆస్పత్రిలోనే ఉండాలని వెళ్ళిపోవడానికి వీల్లేదని చెప్పారు డాక్టరు గారు. మా వాడినక్కడ కూచోపెట్టి నేనిలా వొచ్చానయ్యా!..."

ముక్కూ మొహం తెలియనివాడిని... ఈ పైసాకి రికానాలేని వాడు తీసికెళ్ళి ఆస్పత్రిలో జేర్చాడుట.... కథలు చెప్తున్నాడు కథలు... తన దగ్గిర్నించి ఊరికే డబ్బులు రాబట్టుకుందుకు ఇదో పన్నాగం కాబోలు.

"ఇప్పుడు పిల్లకీ పిల్లాడికీ కొత్త బట్టల్లేకపోయినా పర్లేదు. అవతల ఆ కుర్రాడు బతికితే అంతే చాలు. పాత బట్టల్లో మీ చొక్కా ఒకటి అమ్మగారి చీర ఒకటి కాస్తంత బావున్నవి చూసి ఇస్తారేమోనని అడగటానికొచ్చానయ్యా".

"చాల్లే... నువ్వు పాతబట్టలడగ్గానే చూసివ్వడానికి మాకు తీరుబడి ఉంటుందనుకుంటున్నావా? మా ఆవిడసలే బిజీ మనిషి. ఇప్పుడు పక్కింటావిడతో కలిసి ఎవరింటికో వెళ్ళబోతోంది. ఇంతోటి పాత బట్టలూ మీ ఊళ్ళో ఎవరినయినా అడుక్కోవచ్చు. ముందు మీ ఊరెళ్ళిపోండి మీ ఇద్దరూ. ఆస్పత్రిలో ఆ అబ్బాయి సంగతి వాళ్ళే చూసుకుంటారు. నీకూ నాకూ ఎందుకు చెప్పు?..." చిరాకు ధ్వనించింది కాశీపతి స్వరంలో.

"లేదు లెండయ్యా... అతగాడికి తెలివొచ్చాకే మా ఊరికి పోతామయ్యా. అప్పుడే మాకూ మనసుకి నెమ్మదిగా ఉంటుంది. వొస్తానయ్యా దండాలు".

వెళ్ళిపోతున్న వీరయ్యని ఓ పిచ్చాడిని చూసినట్టు చూశాడు కాశీపతి.

✧ ✧ ✧

హాస్పిటల్లో కుర్రాడికి తెలివిరాగానే చెప్పిన నెంబర్‌కి ఫోన్ చేశాడు డాక్టరు. భార్యని కూడా వెంటపెట్టుకుని ఉరుకుల పరుగులమీదొచ్చినట్టు వొచ్చాడు కాశీపతి. మంచమ్మీదున్న తన చెల్లెలి కొడుకుని చూస్తూనే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. హాస్టల్లో ఉండి చదువుకుంటున్న మేనల్లుడు... బుద్ధిమంతుడు.

"అయ్యో అయ్యో... ఎంత గండం తప్పింది!" కంగారుపడుతూ తలనిమిరింది ధనలక్ష్మి.

"ఇక్కడికి తీసుకురావడం ఒక్క పదినిమిషాలు ఆలస్యం అయినా ప్రాణానికి ముప్పు కలిగేది. అదిగో... పాపం... ఆ పల్లెటూరి మనిషి సమయానికి చూడబట్టి ఇక్కడికి తీసుకురాబట్టి సరిపోయింది" అంటూనే తలుపు పక్కగా ఒదిగి నిలబడ్డ వీరయ్యని చూపించాడు డాక్టర్.

నోట మాట రాలేదు ఆ దంపతులకి. అప్రయత్నంగా చేతులు జోడించి చూస్తుండి పోయారు వీరయ్యవైపు.